క్లుప్తంగా

నేడు చెన్నారెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

తర్లుపాడు: మండలంలోని చెన్నారెడ్డిపల్లి సచివాలయం పరిధిలో సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ భూలక్ష్మి రాసుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మురారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా అమరసింహం


అమరసింహం

పొదిలి: బీజేపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ జిల్లా ఉపాధ్యక్షుడిగా మాకినేని అమరసింహం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి నియామక పత్రం అందినట్లు అమరసింహం ఆదివారం తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, దగ్గుబాటి పురందరేశ్వరి, సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు శివారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యుత్ లేక నీటి కష్టాలు

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండంలో గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో మంచి నీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. రెండు రోజుల క్రితం వచ్చిన ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. త్రీఫేజ్ మోటార్లు పని చేయకపోవడంతో గ్రామస్తులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు విద్యుత్ శాఖ ఏఈ, డీఈల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని సర్పంచ్ ఆరోపించారు.

నేడు సర్వ సభ్య సమావేశం

దొనకొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలన్నారు. పలు శాఖలకు చెందిన అధికారులు సమగ్రమైన సమాచారంతో సమావేశానికి హాజరు తెలిపారు.

మోదీ విధానాలను ప్రతిఘటిద్దాం


మాట్లాడుతున్న రమాదేవి

మార్కాపురం: దేశ సంపదను సంపన్నులకు దోచి పెట్టే మోదీ విధానాలను ప్రతిఘటిద్దామని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకనాల రమాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం ఐద్వా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పట్టణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మోదీ అధికారంలోకి వచ్చే నాటికి రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ రూ.1200కు చేరిందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలతోపాటు టోల్ గేట్ చార్జీలను పెంచిన ఫలితంగా ఆర్టీసీ బస్ చార్జీలు కూడా పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పేదలకు అందుబాటులో ఉన్న ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసి ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో జనరల్ బోగీలను తగ్గించి, ఏసీ బోగీల సంఖ్యను పెంచడాన్ని తప్పుబట్టారు. మోదీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పేదలపై భారాలు మోపుతూ సంపన్నులపై వరాల జల్లు కురిపిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఐద్వా పట్టణ అధ్యక్షురాలు ఎస్‌కే రెహానా, కార్యదర్శి డి.శారా, దేవమణి, మార్తమ్మ, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆది శంకరాచార్యుల జయంత్యుత్సవం


ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆది శంకరాచార్యుల జయంతిని పురస్కరించుకుని మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సోమయాజుల ఆదిప్రసాద్ తెలిపారు. సమస్త లోకాలకు ధర్మాన్ని ఉపదేశించిన గురువు ఆదిశంకరాచార్యుల గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. హరిహరరావు, వి.కేశవశర్మ, సుబ్బాశాస్త్రి పాల్గొన్నారు.

ఉత్సాహంగా హైస్కూల్ వార్షికోత్సవం

చీమకుర్తి: సంతనూతలపాడు మండలం గంగవరంలోని హనుమంతరావు హైస్కూల్ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, కంచర్ల శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి


ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి


అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టిమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్ర నామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకం చేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు నాలుగు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ. 14,332 ఆదాయం వచ్చినట్లు ఆర్‌పి శ్రీనివాసరావు తెలిపారు. సౌకర్యాలను ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నాగాంజనేయస్వామికి పూజలు

పెద్దారవీడు: మండలంలోని ఎస్.కొత్తపల్లె గ్రామ సమీపంలో వెలసిన శ్రీ నాగాంజనేయస్వామి పుట్ట వద్ద ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. పుట్టను పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి పాలు, పండ్లు, పొంగళ్లు సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు చేరుకుని స్వామివారిని దర్శించుకుని కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి 16 రోజుల పండగ


స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 16 రోజుల పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చెన్నకేశవస్వామి, ఉభయదేవేరులను అర్చకులు శ్రీపతి అపన్నచార్యులు, కేశవులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కేశవరావు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

ప్రతి ఇంటినీ సందర్శించాలి


పార్టీ నాయకులకు అభినందిస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: ప్రతి ఇంటిని వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్ష కమిటీ సభ్యులు సందర్శించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో 11వ వార్డులోని మొత్తం 480 ఇళ్లను జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సందర్శించిన టౌన్ జేసీఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర, వార్డు ఇన్చార్జి ఉత్తమ్ కుమార్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, సచివాలయ కన్వీనర్ సీహెచ్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగనన్న


పాతపాడులో ఓ ఇంటికి సీఎం స్టిక్కర్‌ను అంటిస్తున్న జెడ్పీటీసీ ఏడుకొండలు

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు లభిస్తున్నాయని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పాతపాడు, నాగంపల్లి, చినారికట్ల, గనివానిపాడు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి చేస్తున్న మంచి పనులను ఇంటింటికీ తిరిగి ప్రలజకు వివరించారు. పార్టీ మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, ఉడుముల గురవారెడ్డి, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశ పరీక్షలు


అంబేడ్కర్ గురుకుల కళాశాల

దర్శి: స్థానిక అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్షలు జరిగినట్లు ప్రిన్సిపాల్ రూత్ రుమేల తెలిపారు. ఉదయం 5వ తరగతి విద్యార్థులకు, సాయంత్రం ఇంటర్ విద్యార్థులకు విడివిడిగా పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షలకు 165 మంది, ఇంటర్ ప్రవేశ పరీక్షలకు 175 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షా ఫలితాలను బట్టి విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. 400 మందికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. లైన్ నారపుశెట్టి మదుసూదన్ రావు, పెద్దిరాజు, సత్యం, కల్లూరి ,విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

అన్నదాన సత్రం నూతన కమిటీ ఎన్నిక


వడ్డెర రాజుల నూతన కమిటీ

తాళ్లూరు: గుంటి గంగ వద్ద గల వడ్డెర రాజుల అన్నదానం సత్రం నూతన కమిటీని అదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా తన్నీరు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా బండారు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడుగా బత్తుల శ్రీను, కార్యదర్శిగా కుంచాల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా మన్నెం శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులుగా తమ్మిశెట్టి ఏడుకొండలు, జాయింట్ సెక్రటరీగా కుంచాల చలపతిరావు మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. సంఘ అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని బాధ్యతలు చేపట్టిన వారు తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం


రిబ్బన్ కట్ చేస్తున్న ఎంపీపీ ఉషామురళి

దొనకొండ: మండలంలోని వీవీపురంలో ఐటీసీ సహకారంతో వాటర్ ప్లాంట్ మంజూరైంది. ఆదివారం ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌కుమారి దేవానంద్ రిబ్బన్ కట్ చేసి వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. బటన్ నొక్కి స్వచ్ఛమైన నీటికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో ఐటీసీ సంస్థ ముందుకు వచ్చారన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయటం సంతోషకరమని ఎంపీపీ తెలిపారు. మండల కోఆప్షన్ సభ్యులు షేక్ గఫార్, ఎంపీటీసీ గుంటు అమ్మాజీ అజయ్, జొన్నకూటి సుబ్బారెడ్డి, షేక్ సలీమ్, వార్డు సభ్యులు భట్టు, రామారావు, గురవయ్య, శేఖర్, బొందల రాజు, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవాలయంలో ప్రత్యేక పూజలు


వేడుకల్లో కుంకుమ అలంకరణలో అమ్మవారు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు నడిబొడ్డున రెండు తాగునీటి చెరువుల మధ్యన కొలువైన శ్రీవైష్ణవీ దుర్గాలయం 22వ వార్షికోత్సవాలు శనివారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. ఆదివారం స్థానిక వైష్ణవాలయంలో ఉదయం నుంచి ఆలయ ధర్మకర్తలు, ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ భక్త మండలి ఆధ్వర్యంలో లలితా పారాయణం నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

శింగరకొండ దర్శిని


అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం. ఉత్తరాయణం వైశాఖ మాసం మృగశిర నక్షత్రం చవితి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం అలయం మూసివేస్తారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారికి చందనాలంకారం


చందనాలంకారంలో శ్రీవారు

చీరాల టౌన్: అక్షయ తృతీయ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో వేంచేసి ఉన్న లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి మందిరంలో ఆదివారం ఉదయం శ్రీవారికి విశేష పూజలు జరిగాయి. ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా చందనాలంకారం చేసి విశేషార్చనను ఆలయ అర్చక స్వామి భువనేశ్వర శర్మ జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమాన్ని మందిర కమిటీప్రతినిధులు పర్యవేక్షించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ విట్టసుబ్బారత్నం కల్యాణ మండపంలో ఒంగోలుకు చెందిన రమేష్ సంఘమిత్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు 200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ ఐవీ రెడ్డి ఆర్థోపెడిక్ నిపుణులు పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులను పంపిణీ చేశారు. న్యూరో సర్జన్ డాక్టర్ ధీరజ్, యూరాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల సంబంధించిన డాక్టర్ మాలకొండా రెడ్డి, రమేష్ సంఘమిత్ర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి

అద్దంకి రూరల్: అకాల వర్షానికి పిడుగుపడటంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈఘటన మండలంలోని చక్రాయపాలెం గ్రామ పొలాల్లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. మండలంలోని చక్రాయపాలెం గ్రామానికి చెందిన గుమ్మడి నరసింహారావు ఇటీవల ఒక్కో గేదెను రూ. 80 వేల చొప్పున కొని మేపుతున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం గేదెలను తోలుకుని పొలానికి వెళ్లగా ఇంతలో వర్షం పడటంతో గేదెలకు దూరంగా వెళ్లి నిలుచున్నాడు. ఈ క్రమంలో రెండు గేదెలపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాయి. రెండు గేదెల విలువ రూ.1.60 లక్షలు అవుతాయని, అవే జీవనాధారంగా జీవిస్తున్న తనకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని గేదెల యజమాని కోరారు.

26న వీరాంజనేయుల తిరునాళ్ల

బల్లికురవ: మండలంలోని పెదంబడిపూడి గ్రామ సమీపంలోని చింతతోపులో వేంచేసి ఉన్న వీరాంజనేయుని 40వ వార్షిక తిరునాళ్ల బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆలయ అర్చకుడు గుడిమెళ్ల పవన్‌కుమార్ శర్మచే ఉదయం 5 గంటల నుంచే వీరాంజనేయునికి ఆకుపూజలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రభలతోపాటు కోలాట ప్రదర్శన, వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆధ్వర్యంలో రెండు భారీ ఎలక్ట్రిక్ ప్రభలు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ వేడుకల్లో గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

పంచాయతీ కార్యదర్శుల సమావేశం నేడు

చీరాల టౌన్: మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీవో నేతాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో హాజరుకావాలని ఎంపీడీవో ఆదేశించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న స్పందనకు అన్నీశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని ఆ ప్రభుత్వ శాఖకు బదిలీ చేస్తామని, అన్నీశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహశీల్దార్ సూచించారు.

మతోన్మాద బీజేపీని గద్దె దింపుదాం



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు అంజయ్య

యర్రగొండపాలెం: కేంద్రంలోని మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ జాలా అంజయ్య పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టు పార్టీలు చేపట్టిన ప్రచార భేరిలో భాగంగా ఆదివారం స్థానిక బ్యాంకు స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వ కాలంలో దేశాన్ని అప్పుల ఊబిలోకి దించారన్నారు. ఆ అప్పును దేశంలోని 147 కోట్ల మంది తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశాన్ని అప్పుల పాలు చేయడంతో పాటు మతోన్మాదాన్ని రెచ్చగొట్టడాన్ని మోదీ ఒక పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రూ.3 లక్షల కోట్ల విలువచేసే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని మోదీ తనకు అనుకూలమైన కార్పొరేట్ వ్యక్తులకు అప్పజెప్పేందుకు కేవలం రూ.30 వేల కోట్లకు అమ్మకానికి పెట్టారన్నారు. దేశసంపదను ఆదాని, అంబానీ లాంటి 150 మంది పెద్ద పెట్టుబడిదారులకు దోచిపెడుతూ పేదలపై భారం మోపుతున్నారని విమర్శించారు. ఆ పెట్టుబడిదారుల్లో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ముస్లింలు లేరన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 సంవత్సరాలు అయినప్పటికీ చేసిన వాగ్దానాలను ప్రధాని మోదీ నెరవేర్చలేకపోయారన్నారు. మోదీని గద్దె దింపే రోజులు దగ్గరపడుతున్నాయన్నారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ప్రముఖ సీపీఐ నాయకుడు పూలసుబ్బయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దేవేండ్ల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.వి. కృష్ణగౌడ్, షేక్.రఫీ పాల్గొన్నారు.

భర్త వేధింపులపై భార్య ఫిర్యాదు

- మనస్తాపంతో గాయపర్చుకున్న భర్త

కొనకనమిట్ల: భర్త మద్యం తాగి తరచూ వేధింపులకు గురిచేస్తుండటంతో ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో మనస్థాపం చెందిన భర్త కత్తెరతో తనను తాను గాయపర్చుకున్నాడు. ఈ సంఘటన కొనకనమిట్ల పంచాయతీ పుట్లూరివారిపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. పుట్లూరివారిపల్లికి చెందిన శిగినం నరసింహులు, చెంచులక్ష్మి భార్యాభర్తలు. కొద్ది రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. భర్త తనను వేధిస్తున్నాడని శనివారం కొనకనమిట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అదే రోజు రాత్రి ఎస్సై దీపిక తన సిబ్బందిని విచారణ నిమిత్తం పంపారు. నరసింహులును స్టేషన్‌కు రావాలని కానిస్టేబుల్ రమణ పిలవగా.. మద్యం మత్తులో తన భార్యతో పాటు పోలీసులను తిట్టాడు. ఈ క్రమంలో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో నరసింహులు ఇంట్లోకి వెళ్లి కత్తెరతో గాయపరుచుకున్నాడు. బంధువులు చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. నరసింహులుపై భార్య చెంచులక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.